# సన్నజాజులు - సంపెంగలు

మాయింటి పక్కవాటాలో కొత్త దంపతులు దిగారు. కాపురం పెట్టేటప్పుడు రెండు పక్కలనుంచి పెద్దవాళ్ళు వచ్చి వారం పదిరోజులు వరకు నడిపించి ఎవరిదారిని వాళ్ళు వెళ్ళిపోయారు. ఆ మొగుడూ పెళ్ళాం చాలా అన్యోన్యంగా ఉండేవారు. ఆమె చీర చెంగు విడవకుండా అతను తిరిగేవాడు. ఆమె హంసలా వయ్యారంగా కొంచెం పడుచుదనపు గర్వంతో తిరిగేది.

"చూడండి! వాళ్ళెంత చక్కా చిలుకా గోరింకల్లా ఉన్నారో." అన్నాను మా ఆయనతో.

ఆయన నవ్వుతూ, "కొత్తలో అందరూ ఇంతే" అన్నారు ముక్తసరిగా.

కాలం దొర్లుతున్నది. ఆమె పేరు హైమావతి. అతని పేరు ఆనందరావు. అతను బాంకిలో పని చేస్తున్నాడు. ఆమెకూడ చదువుకుంది. నెల మొదటి వారంలోనే పత్రికలు, పుస్తకాలు అన్నీ కొని తీసుకువచ్చి ఆయన పడేయటం, ఆమె వాటిని చదివి, మాచేత చదివించి చర్చించడం, జరిగేది, చాల సరదా అయిన మనుషులిద్దరూ.

నెలలు గడిచి కొంచెం ముఖాలు పనిపాట్లు పాతబడ్డాయి. ఇల్లు దిద్దుకోవడంలో ఆమెకు బద్ధకం - పనినుంచి ఆలస్యంగా అతను వచ్చి అలిసిపోవడం, వాటితోపాటు జీవితం కొంచెం మెల్లిగా ముందుకు సాగడం - గమనించాను. అన్ని కుటుంబాలలోను ఇది మామూలే కాబోలు.

అప్పుడే ఎండలు ముదురుతున్నాయి. గాలిలో చిన్న వెచ్చదనం తోస్తున్నది. దినాలు పెరుగుతున్నవి, చల్లని నీళ్ళలో మరికొంచెం స్నానమాడి పోవాలని ఉంటేది.

వసంతకాలం వచ్చిందో.........వెళ్ళిందో......ఒకరోజు మా ఆయన బజారునుంచి సాయంకాలం వచ్చేటప్పుడు సన్నజాజులు, కొద్దిగా సంపెంగలు తెచ్చారు.

"ఇంకా బజారులోకి ఇప్పుడే దిగుతున్నాయి. కొనాలనిపించింది," అన్నారు ఆయన. నేను వాటి పరిమళాన్ని ఆస్వాదిస్తూంటే.

"నీకు చక్కగా వీటిని దండగుచ్చడం, తురుముకోవడం తెలుసు...కొంచెం ఆఫీసులో పని సాయం చేయమని మేనేజరుగారు చెప్పారు. రాత్రికి తొమ్మిదింటికి ముంగాదునే వస్తాను. అప్పుడే

నేరెళ్ల రామలక్ష్మి

భోజనాలు," అన్నారు ఆయన వెళ్ళి పోతూ,

సావకాశంగా నీళ్ళు పోసుకోవచ్చును కున్నాను. పువ్వులను దండగా గుచ్చాను. కొన్ని సన్నజాజుల తరువాత ఒక్కటే సంపెంగ, మళ్ళా ఆ విధంగానే...ఆ దండముడిలో తురుముకుంటే...సన్న జాజులు సంపెంగలు నల్లని జుత్తుమీద నాక సౌందర్యాన్ని వెదజల్లుతాయి. మృదువుగావచ్చే పరిమళాన్ని ఆఘ్రా ణిస్తూ, దీపకాంతిలో ఆ పూల సౌంద ర్యాన్ని చూస్తూ, ఆయన ఒళ్ళు మరిచి పోతారు.

అన్నీ ఆలోచిస్తూ వాకిట్లో కూచొని దండ గుచ్చుతున్నాను పక్కవాటా నుండి ఏడుపు బలవంతాన దిగమింగి హైమావతి బెక్కుతున్నది పొద్దుటినుంచి ఏదో పనిలోమునిగి అట్టే గమనించ లేదు. దండ పూర్తిచేసి, జాగ్రత్తగా అరటి ఆకు కప్పి, టేబిలుమీద పెట్టి ఆమె దగ్గరకు వెళ్లాను।

తట్టిన కొంచెంసేపటికి హైమావతి వచ్చి తలుపు తీసింది. కన్నీటి చారికలు ముఖంమీద కనిపిస్తున్నాయి. జుత్తు పీచుకట్టినట్లుంది. ముఖం వాడిపోయింది.

"ఏం హైమా !......"

నన్ను చూడగానే ఒక్కసారి ఆమె అణచుకున్న దుఃఖమంతా పైకి వచ్చే సింది. లోపలికి తీసుకు వెళ్ళి ఓదారిస్తే నిజం బయటపడింది. ఏదో పెళ్ళిలో వాళ్ళ అన్నదమ్ముల్ని మర్యాదగా చూడలేదని అతనంటే, ఏనాళ్ళలో తన చెల్లెలిని అవమాన పరచారని ఆమె అంటే —ఆమాటలు క్రమంగా ముదిరి కోపాలు పెరిగి, అతను భోజనం చేయ కుండా ఆఫీసుకు వెంచేసి, ఆమె అలిగి తలవిగించుకొని ఏకధారగా ఏడుస్తూ... వారి దాంపత్యంలో మొదటి పోరాటం మొదలయింది.

"పిన్నిగారూ ! నేనెంత తప్పు చేశాను - మా చెల్లెలిని అవమానపరిచితే నన్న వమానించినట్లుకాదా ?" అంటి హైమావతి.

"హైమా !... నువ్వు చదువుతున్నా ఇంకా చిన్నపిల్లగా ఉంటే ఎలా ?... ఎప్పుడో అయిపోయిన విషయం గురించి ఇంతగా పట్టించుకోవాలా ?"

"అవును.. ఆయనకూడ ఎప్పుడూ ఇటువంటివి పలికారుకారు. ఎందుకు వొచ్చిందో రభస."

"ఒకరినొకరు అర్థంచేసుకోవాలంటే ఒకే కొమ్మమీది పూలు గాలికి కొంచెం ఎడమిచ్చినట్లు దూరమయి, ఎడబాటుకి పరితపించి తొందరగా పూలు చేరు కున్నట్లు, మరీ చేరుతుంటారు. దాంప త్యంలో ఇటువంటి చిన్న కలహాలు లేకపోతే మమత లెలా పెరుగుతాయి. లే ; ముఖం తుడుచుకో!...కాఫీతెస్తా--

త్రాగు. వేగంగా వంట ముగించు నేనుకూడా సాయంచేస్తా..."

హైమావతి కళ్ళు తుడుచుకొని ఇల్లు చక్కబెట్టింది. కాఫీ త్రాగి వంట మొదలు పెట్టింది. ఆమెకు జడ వేసి ముస్తాబు చేసి తీర్చిదిద్దేసరికి చీకటి పడింది.

"చూసుకో! అద్దంలో మరొక్కసారి! చక్కగా సత్యభామలా చూస్తూంటే నాకే మతి తప్పుతున్నది. మరి మీఆయన పాదాక్రాంతుడు కాకుండా ఉండగలడా?"

"పోండి పిన్నిగారూ! మీరు మీ మాటలూను" ఆమె బుగ్గలలో సిగ్గులు తోచాయి. అంతలోనే వాళ్ళ ఆయన ఏళ్ళ తరబడిని ఆమెను వెదుక్కుంటున్నట్లు ఇల్లు చేరుకున్నాడు.

పుస్తకం చదువుకుంటుంటే చిన్న కునుకు పట్టింది. ఆయన వచ్చి తలుపు తట్టేవరకు తెలివిరాలేదు. వడ్డిస్తూంటే ఆయన నావేపు సాకాంక్షగా చూశారు. తరువాత పడకగదిలోకి వెళ్ళివచ్చారు. నాకు తెలును, ఆయన ఏమి వెదుకుతున్నారో!

"హైమావతి ఇవాళ మొగుడిమీద అలిగింది. ఆయనకు కోపం వచ్చింది. తెలిసిన తరువాత ఎలా ఊరుకోవడం? దారికి తెచ్చి ముస్తాబుచేసి చూస్తే ఏదో ఒక లోపం కనిపించింది. గుచ్చిన సన్నజాజుల దండ ఆమె జడలో తురిమితే ఎంత అందంగా ఉంది. ఏదో వాళ్ళని కలిపితే; చిన్నతనం..." అన్నాను ఆయన కళ్ళలోకి చూస్తూ!

ఆయన ముఖంలో సందేహం తొలగిపోయింది.

ఒక చిన్న చిరునవ్వు శరత్కాలపు వెన్నెలలా అనురాగపు అమృతంలా భాసించింది

"నీ మనస్సులో మల్లెలున్నాయి. సన్నిధిలో సన్నజాజులున్నవి, సహజీవనంలో సంపెంగలున్నవి. ఇవి ఎప్పుడు వాడి పోవనివి" అన్నారాయన నన్ను గుండెలకు హత్తుకొంటూ.

